# రసమంజరి

"అచ్ఛా! బులావ్..." అని ఉన్న పాళాన కారు యిచ్చి పంపాను, తక్షణం... యెంత ధరపడినా కొట్టుకు రమ్మని.

-- వచ్చిన పనేమో అయింది, రోజంతా కులాసాగా గడచిపోయింది. రాత్రికి రైలు లేదు.

మాంచి భోజనం, మజా అయిన చల్లగాలి -- మామూలు వేళకు మునుపే, మనలో కామన్న కన్ను తెరిచాడు - వేళ కనిపెట్టి .. బాషా, సమీపాన కూర్చుండి, ఆకులు చీల్చి యిస్తున్న వాడల్లా లేచి, దూరంగా జరిగి నిలుచుని, వినయం ఒలికిస్తూ ... నా ముఖంవంక చూసి ... తల వంచుకుని, చిరునవ్వుతో ఏదో చెప్పబోయే అదుర్దా కనబరుస్తూ --

... అదంతా ఎప్పటి భాగవతమే; నేను పాతకాపునే అయినా, బంగాళాలో మకాం చేసినపుడల్లా, యీ నాందీ ప్రస్తావనలు లేనిదే... అసలు బొమ్మతెర దీసుకురాదు. ఈ విషయంలో, మూడు ముక్కాకలదీరిన బంటునిన, వాడికి తెలిసినా, కవ్వించిన తరువాత కాని, అసలు కథలోకి దిగడు సరి, వాడికి గురువాజ్ఞ, అది కాబోలు, మరి.

-- అయ్యా? చిదిపిదీపం పెట్టినట్టుంటుంది. మీరు చూస్తే వదిలిపెట్టరు. ఆ మాటా, మంచితనమూ... అసలు యీ రకమేకాదు: ఏదో తమలాటి ప్రభువులు ఎన్నడన్నా పిలిపిస్తే ఏదో ఖుషామత్...అంతేకాని... అయినవాడూ, కానివాడూ ఆ పిల్లదానివంక చూడటానికే వీల్లేదు.. చాలా హైక్లాస్... "మనసు ప్రధానంగాని... డబ్బెవరికి కావాలోయ్...." అని నాతోనే అన్నదండీ నేనేదో మాటవరుసకు ఒకటి రెండుసార్లు మాంచి భారీబేరాలు తీసుకువెళితే... అంత హుందాతనమూ... అందుకు మించిన అందమూ... (బాషా... తురక బిడ్డడైనా... నాకన్న తెలుగు బాగా వచ్చును... వాడి వ్యాపారం అవసరంకొద్దీ... అలవాటై పోయింది.)

నేను అన్నింటికీ తల ఊగించాను: మనం కార్య వాదులం... మాటలతో మన కేంపని?--

కారు--- నిమిషంలో తిరిగివచ్చింది... వెన్నెల్లో... నా గది వేపు... కారుదిగి... తెల్లచీరె... నడిచి వెళుతూంది. బాషా దగ్గరకువచ్చి... సకిలించాడు; నేను లేచి.... లోపలికి వెళ్ళాను... నేను రావడం విని.... చీకటిలోనుంచి లేచి... దీపం వేసింది...

మనిషిని పోలిన మనిషి -- మనకు తగలడం -- సామాన్యంగా --- సామెతలలోనే కాని -- మామూలు కాదు. అవునా, కాదా అని అంచాయించి చూసి --- ఆలోచనలో పడకుండా -- ఒకొళ్ళ నౌకరం గుర్తించుకున్నాము. కాకల

దీరిన బంటును అయినా – ఆవేళప్పుడు, రాజమ్మ – నాకు తార సిల్లడం – కలలోనైనా అనుకోని విషయం.

వచ్చినవా రెవరో తెలిసిన ధోరణిలో – ఎందుకు పిలిపించానో (ఎవరినో) ఆ సంగతి మరచిపోయి – ఆమె సంగతి మనసులో తలచుకుంటూ – మాటాడ వలసినది ఎంతో ఉన్నా – ఎక్కడ మొదలుపెట్టాలో తోచకుండా – చూచిన కొద్దీ కన్నూ మిన్నూ మీరుతూన్న కోపంతో--

రాజమ్మను – నేను మాంచి పైలా పచ్చీసుమీద వుండే కుర్రతనంలో ఓ మాదిరిగా బాగానే ఎరుగున్నాను. అప్పటికి బహు ఉమ్మరంమీద ఉంది – అలా సంపాదించుకుంటూ పోతే – ఆ రోజుల్లో వడ్లకు ఒళ్ళూపై తెలియని ధరలు – పదిసార్లు ఒగ్గితే బంగారు పిచ్చుక అయిపోయేటంత – భారీ సంపాదన ఉండేది – సంసారికి వుండవలసినంత ఫాయాతో, పొదుపుతో – ఎన్నికలోకి వచ్చిన సానిపాప–

ఆయేడు వేసవి కాలంలో – మొదట పత్రికలో చదివి – అది నీలివార్తయేమో అనుకున్నాం – రాజమ్మ ఉన్నట్టుండి పెళ్ళి చేసుకున్నదంటే – ఆమెకు అంత అవసరం ఏంవచ్చిందా అని – ఆ రోజంతా అందరం పరిపరివిధాల ఆలోచించాము. నాలుగురోజులకు పేపరులో దంపతుల బొమ్మలు పడ్డాయి. ఇక ఒప్పుకోక తప్పదుకదా. నిక్షేపంలాంటి పిల్లది అపమార్గాన పడిపోయింది కదా – అని మా కళాహృదయాలు గడబిడ చేసినవి. కాని – ఎటుచూసినా – మనకు అందుబాటు తప్పిపోయింది. గనుక యిక – మన కెందుకూ – అని ఆమె సంగతి యితర ధ్యాసలతో కలిపి – మరచిపోవడం అలవాటు చేసుకున్నాము. చేసుకున్న వాడుకూడా మా భాయీల జాతి వాడే కావడంవల్ల – అభినందించడాలూ, అనవసరంగా టీకి తయారుకావడాలూ – యిలాంటి హంగామా ఏంచేసినా మరీ డెలికేట్‌గా ఉంటుంది గనుక లోపల ఎంత పురపుర ఉన్నా వాళ్ళ కంటబడకుండా తప్పించుకు తిరిగాం. ఇంతకూ వాడు అదృష్టవంతుడు – తలకుమించిన పడుచును – తనదాన్నిగా – పిలువకుండా – చేసుకున్నాడు – వలచడమూ – మేమూ, మా మొగమూను!

రోజులు గడచినకొద్దీ... వాళ్ళు యిద్దరూ కులాసాగానే కాలం గడుపుతూన్నట్టు... కబుర్లు తెలుస్తూండేవి. తరువాత... ఏమిటో జీవితంలో... తలకొక దారి...కొన్ని వెనుకబడి పోతూంటవి....అన్ని వ్యాపృత్తుల్లో: రాజమ్మను మరచిపోక పోయినా... ఆమెను చూసేదాకా...జ్ఞాపకం లేదు. మళ్ళా, అలా...మామూలుగా తయారు కావడం... అయితే...అదివరకు నేను విన్నదంతా అబద్ధమేనా?... అప్పుడైతే...మనకెందుకని ఉక్రోషంతోనే ఊరుకున్నా...ఇప్పుడు...

ఆమాటే అడిగాను...

'అదంతా నిజమే... అబద్ధాలు మాత్రం మీ చెవుల దాకా రాలేదు. అందుకు నా మంచితనమే కారణం...' అన్నది.

'అంటే...'

'అంతా అర్థం కావాలంటే.... కథ చాలా పెరుగుతుంది...'

'పెరిగేది ధరకాకపోతే.... కథ ఎంతైనా... ఇంకా రాత్రి కావలసినంత వుంది...'

'మీకు...రాత్రంతా కావలిసిందే' అని నవ్వింది... ఆ కొంటెతనంలో ... ఏనాటి

అనుభవమో పులకరింప చేసిన ఆమె జాణతనానికి... చూపులతో జోహారు లిచ్చాను...

– కాఫీలో... నాకన్న ఎక్కువ పాలుపంచి...బలవంతంచేసి...మురిపెంతో త్రావించాను తాంబూలంతో మా పెదవులు ఎర్రబారినవి: సిగరెట్ పొగ మెలికలతో బాటు కన్నులు కులికిస్తూ... రాజమ్మ... పలకబోయేదంతా... తలలో కలగా కలియవేసుకునే మౌనంలో...నన్ను సావధానుణ్ణి చేసింది.

--నేనూ అలాగే అనుకున్నాను మొదట: అంతో యింతో అయినా అతనితో సుఖపడలేక పోతానా అని: ఎంతకైనా ముందు యీ చెర తప్పుతుందికదా...

అవును? నాకా బ్రతుకు నిజంగా చెరగానే అనిపించింది: ధర్మపన్నాలు చదవడం లేదు: అదివరకంతా చేసింది పాపమని కాదు నే ననేది: అందరూ నాతో సుఖపడుతున్నారు: ఆ కథకు అంతు తెలిసింది గనుక... తెరిపిగా నే నెందుకు సుఖపడకూడదూ అనుకున్నాను. అందుకు తగినట్టుగా... ఆ రోజుల్లోనే అతను... నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు:

అందుకు నేను పొంగిపోలేదు: మనిషిలాగా ఉండవచ్చును కదా అనుకున్నాను: 'కాసిచ్చిన గరాసుకెల్లా దాసి' గా ఉండే... తనంపోయి – వేళకు ఆదమరచిన నిద్రకు నోచుకునే -- భార్య సామాన్య హక్కు – దక్కుతుంది కదా అని – ఒప్పుకున్నాను: తెగువతనానికి లోకులు ఇచ్చిన మెప్పులన్నీ అతనికి అప్పగించి -- అందరితోబాటు దాన్ని.. అదోమాదిరిగా నన్నా అయి... తగినచోట తలదాచుకునే తావు దొరికిందా... మనసిచ్చి... మచ్చికలకు గాక -- తనదాని ననుకోదలచిన – దయాశాలి... తన కబ్బిన తరువాత -- ధనమే జీవనమైన తనువుకు ---

ఎందుకూ... కల నిజం కాకపోతే...ఈలాగే దానంతట కవిత్వం ముంచుకువస్తుంది. దీనిల్లు బంగారంగానూ?

అంటే జ్ఞాపకం వచ్చింది; దుకాణం కట్టిపెట్టి ఒక యింటిదాన్ని అవుతానని మాటవరుసకు మా అమ్మతో అంటే; 'అదేమి ఊహే నీయిల్లు బంగారంగానూ?' అన్నది. 'అందుకేనమ్మా – యిల్లు బంగార మౌతూన్నకొద్దీ – పరుగెత్తుతూ బరువు లెత్తాలి: సంపాదించలేనని కాదు; చాలు నీకు – ఇక నాకా – బంగారుకొండ దొరుకుతున్న దమ్మా' – అని – ఏవేవో చెప్పాను:

-- సరే ... యింటిపేరు మారింది; నాతీరంతా మారింది. నెలరోజులు...అందమైన చోట, హాయిగా కాపురం చేశాము – అదిగో నవ్వుతున్నారు... నేను ఒట్టు వేసుకు చెపుతా వినండి...సంసారితనంలో ఉండే ముచ్చట సానికే తెలియాలి: ఇది నిజం:

నన్ను నేను మరచిపోతున్నాను: కాని, లోకులు నన్ను మరచిపోలేదు... అంతా తలక్రిందు నాటకం... మునుపటికన్న...నా చక్కదనం పెరగలేదు... ధర విపరీతంగా పెరిగింది.

నిజం – అదివరకంటే...అందరితోబాటు...నేనూ ఒకతెను. యిప్పుడు.. వాహిని హెచ్చించి: ఫలానివాడి భార్యతో అనేటప్పటికి ... ఎంత ఖరీదైతే మాత్రమేం?... అలాగే... నేను విదిలించి కొట్టిన కొద్దీ...పెంచారు...పెంచారు: నా తరతరాలవారూ చేసుకున్న పాపంలాగా... ధర పెంచారు: బేరంసారం భారీగా సాగేందుకు యిదో కొత్త ఎత్తు వేశానని...అందరూ ...అనుకోవడం...అవును ఏమైనా ...సానినేగా...

దొంగచాటున చీటీలు పంపడం... ఆయన యింటలేని జాడ కనిపెట్టి రాయబారాలు నడపటం... నాకు విసుగు ఎత్తినా. .. దుమ్మెత్తి పోసి పోసి సత్తువ చచ్చినా... విరామం ఎప్పటికా భగవంతుడాఅనిపించేది – కొన్ని రోజులకు దొడ్డివాకిలి సందడి దాని పుణ్యమా అంటూ దానంతట అదే అణగింది. ఇక గట్టెక్కవచ్చును అనుకున్నాను.

కాని – యింకో భాగవతం మొదలు...

– రాజమ్మ ముఖం కండలు చించుకుంటూ మాటాడుతూంది: నేను వింతపడుతూ వింటున్నాను. అందులో – ఆమె అనుకున్నంత అన్యాయం నాకు కనుపించలేదు: అరితేరిన వాడిని కాబట్టి – అయినా – ఊరికే వింటూ ఊఁ.. ఆఁ.... అంటూంటే బాగుండదని, మాటకు అడ్డం వెళ్ళి...

"–ఆయనతో చెపితే ఎలావుండేదో – నీకు అంత అనవసర హైరానా తప్పిపోయేది: అతనికి తెలిసిందని వింటే నిన్ను ఎవరూ తేరిచూడక పోయేవారేమో–" అన్నాను. రాజమ్మ, చనవు – చిరాకుతో – 'కాసాకు వినండి – ప్రశ్నలు వేయవలసింది నేను, మీరు కాదు –' అని గదమాయించి... అంతలో ఆ కవళిక మార్చేసి –

'ఆఁ– ఎక్కడిదాకా చెప్పాను! మరి–హాఁ – ఆయన సంగతే చెప్పబోతున్నాను. అంత మంచివారు: ఊరందరూ స్నేహితులు – అందరికీ మా యింట అయిన వేళా, కానివేళా – విందులు...

అందులో ఏదో కిటుకు ఉన్నదని నా మనసుకు తోచినా – నోరు ఎత్తడానికి వీలులేదు. ఆయనతో లేనిపని కల్పించుకుని – ముఖపరిచయం ముదురు స్నేహంగా మార్చుకుని ఏదో వంకతో యింటికి తయారయే పెద్ద మనుష్యులు... నా వంక దొంగచూపులు చూడడానికే... కాఫీ అందుకునేటప్పుడు చేతికి చెయ్యి తగిలించడానికే... చూసీ చూడనట్లు నన్ను రాచుకు తిరగడానికే.. అని నాకు స్పష్టంగా రోజు రోజూ అనుభవం అవుతూఉన్నా... అలాఅని చెపితే ఆయన అపార్థము చేసుకుంటా రేమోనని... నన్ను నేనే కాపాడుకుంటూ... పాడుమాట రాకుండా, బ్రతుకుతూ నాలో లోకులకు వంకదొరకనీయకుండా చేసుకుందామని విశ్వ ప్రయత్నమూ చేశాను:

చూశాను... చూశాను: చివరకు నాకు తరంగాక... ఆయనతో చెప్పిచూశాను... నావంక వింతగా చూసినవ్వి ... నాకేమీ భయంలేదని భుజంతట్టి బుజ్జగించి... నేనూ పల్లెటూరి పడుచులాగా పరాయి మొగవాడి నీడచూసి ఉలికి పడటం భావ్యంగా లేదు... ఎవరూ కొరుక్కుతినరు... అని యింకా ఏమేమో మాటలు చెప్పి ఊరడించారు:

అవి మాయమాటలని...నాకు రూఢి అయిపోయింది... ఎందుచేతనంటే...కళ్ళూ చెవులూ ఉండి, కని వినే మనిషి.... జరుగుతూన్నది అర్థం చేసుకోలేనంత అబిసి కాడని తెలుసును: విప్పిచెప్పినా ఆకళించకపోతే...ఏదో ముణుగుతుందని నాకు గుండెలలో రాయిపడ్డది... నిజంగా: నన్ను అనుమానించి...నామీదలేని నిందెలు వేసి.... నిమిషానికోమారు కజ్జాకు కాలుదువ్వినా... ఆయన్ను ఏమాత్రమూ శంకించేదాన్ని కాను: ఆయన అలా సహించి.... ఏమీలేదని కమ్మీచేసేయడంలోఉన్న దారుణం...నాకు అనుభవానికి...అతిత్వరగా వచ్చింది...

నేను చెప్పేమాట. వివి... సిగ్గుపడి తలవంచుకోండి... మీ స్నేహితులలో...ఇంత నీతీ, జాతీ లేనివాళ్ళు ఉంటారని ఇదివరదాకా మీకు తెలియదేమో...ఇప్పుడన్నా...నమ్మండి...

ఆయనకు డబ్బు అవసరం వచ్చింది... అవును ఎందుకు రాదూ మరి, సంపాదనకు ఎనిమిదిరెట్లు ఖర్చు చేస్తూంటే.... అప్పు కావాలంటే ఎవరుపడితే వాళ్ళు ఎగపడి యిస్తున్నారు.... చెల్లు వేయడం... నా మీదకు వదిలేశారు...

-- వింటూన్న కొద్దీ నిలువునా నీరవుతున్నాను. అవసరం ఎంతకంఠంమీది కత్తివాటమైనా.... అంత లాచారీ తనానికి జారే నీచత్వం... అతనిలో అంతర్భూతమైనదైతే... అన్నాళ్ళనుంచీ మే మెరుగున్నా మనుకుంటూన్న మనిషి... అతను కానేకాడు... ఊహుఁ... అది కాదు. లోతు తరచి నైజం గ్రహించలేని మా కల్లబొల్లి స్నేహానికి...అది ఫిరంగీ బారు...

కాని ఏమనగలను?...

అనేవి అన్నీ...ఒకటీ వదలకుండా ఆమె అంటూన్నది గుచ్చి గుచ్చి...

నాటకాల్లోనూ...చచ్చురకం సినీమాల్లోనూ అనేకసార్లు మీరుచూసి ఉంటారు. నాయకుడు... తన నాయికను అవసరం కొద్దీ...అంటే, సాధుసంతర్పణకో... సత్యపాలనకో... తార్చడమో, తనఖా ఉంచడమో...జరుగుతూ ఉండటం... తీరా మోసి...అంత పెట్టుబడిపెట్టి అవతలవాడు ఫలసాయానికి తేబోయేసరికి...నాలుగు చేతులవాడో, నాలుగు ముఖాలవాడో అమాంతం ఆకాశంమీదనుంచి ఊడిపడి అదమాయించి...సిద్ధాన్నం చెడగొట్టడం...పాపి ఎవడో, భక్తుడెవడో తెలియకుండా తారుమారు చేసేటందుకు...పతివ్రతను ముందుకుతోసి... ఉహుఁ...ఊరాద్ధాంతం సాగిన కొద్దీ అంతు ఎక్కడిది కాని...అసలు దోవకు వస్తాను...

- బలవంతాన చేయిచేసుకోగల చొరవ కొనుక్కున్న ఆ పెద్ద మనిషినే నిలవేసి... ఆయన, బండార మంతా కనుక్కున్నాను.... పాలు తాగుదామనే ధ్యాసలో... పొరబాటున ఆముదంగిన్నె పెదవులకు అందిచ్చుకున్నప్పటి...అసహ్యం...ఆయనమీద నిలు వెల్లా వేసింది...

మధ్యలో, యింకో ధర్మ సందహం...యిరికిస్తూన్నాను. భార్యనైనా పైసాకోసం పరాయివాడికి అప్పగించటానికి టొంకులేని ఘరానాతనమే కాదూ...ఆయనది? - నేను భార్యనైనాను...ఏం లాభం...?

అక్కడితో నేను తిరగబడినాను. వెనుకటిగుణం మానడానికి వీలులేక పోతే...అదివరకులాగా...అది అమ్ముకుని--నేను బ్రతకాలిగాని...మధ్యవచ్చిన ఎవడో వెంకటరాముడికి...ఎందుకు సొమ్ము చేసిపెట్టాలి. అందరికీ నా ఒళ్ళు అమ్ముకుని? (మోటగా వచ్చేస్తూంది, నోట) నాకు, మూటగట్టుకోవడం చేతగాకనా; తలచుకుని, దానికే మళ్ళా దిగితే, బేరాలు తెచ్చేవారు లేకనా?...అలా కుదిర్చే నడి మంత్రపు వాడికి...దయతలచి మేము కాసో వీసమో రాల్చడమేకాని...అర్ధం ప్రాణం ఆచార్యుల పరమన్నట్లు అంతా అప్పగించి ఊరుకునే రివాజు మా కులాన ఏనాడైనా ఉందా? - మీకు తెలియని దేమన్నా ఉందా... చెప్పండి...

ఆయన ముఖంమీద అనేశాను: నేను, ఏలాగూ మగనాలిని కాలేకపోయినాను కదా: ఆయనకు ఆలినిగానే ఉండి... ఆ బెట్టుమీదనే సానినై... ఆ లాభం నేనే దక్కించు కుంటాను: అప్పుడు - వ్రతమూ చెడదు.

తనకేమీ లోపం చేయను; నా పెంపుడుకుక్క ఓ యెత్తూ, ఆయన ఓ యెత్తుగా చూసుకుంటాను... తాను మాత్రం నాకు చేదోడువాదోడుగా వుండి... యింటికి వచ్చిన సరసుణ్ణి గౌరవించడం... వెళ్ళేటప్పుడు సాగనంపడం ... తెల్ల వార్లూ తలుపు తీయడం...వేయడం...అలసి సొలసి ఉంటానా... నేను రెప్పవాల్చేదాకా... కాళ్ళూ నడుమూ పట్టడం... ఇలా చెప్పినట్టుగా విని... ఒళ్ళువంచి పనిచేస్తే...కావలిస్తే...కారుయెక్కి తిరగడానికైనా లోటు ఉండదు; ఎన్ని వేషాలైనా వేయవచ్చు... ఒకరికొకరు చాటు అభినయిస్తూ యెన్ని ఆటలైనా ఆడవచ్చు...

ఇదేమీ... ఆపిల్లవాడికి మ్రింగుడు పడలేదు. నేను మొరాయించి కూర్చుంటే... గడిచే యెత్తులేక... విడిచి ఉడాయించేశాడు...కథ యిలా కంచికి వెళ్ళడంకూడా, ఒకందుకు...మన మంచికే వచ్చిందని... సంతోషిస్తున్నాను. ఏమంటారు...? చూడండి, ఇప్పుడు నాకు యెంత వీలో...అప్పుడూ యిప్పుడూ అదేపనే అయినా -- సానికాక, "మగని కనొరగిన మానిని" అయితే -- మగవానికి మోజింతంతా? – గుట్టు బయటికి తెలియరాకుండా – అఘాయాలోనే నిలిచి – మేహకాయుల దగ్గరనుంచి – గుంజుకున్నది – నాకు నాలుగో తరందాకా ఫోక్తుగా గడుపుకుంటే చాలును:

'మరి... యిప్పుడు ఎందుకు దరిశనమిచ్చావు... ఆ మాటలన్నీ నిజమే అయితే' – అని సందేహంగా మీరు ప్రశ్నవేయడానికి – సిద్ధపడుతున్నారని నాకు తెలుసును: ఏమీలేదు. ఉత్తినే సరదాకు: ఊరికే తినికూర్చుంటే, ఏలా ప్రొద్దుపోతుందని, ఏదో కాలక్షేపంకోసమనీ – తరువాత, పెరిగి పెద్దదాన నైనతరువాత, పుణ్యమూ పురుషార్థమూ... బుద్ధి తెలిసినప్పటినుంచీ – యిదేనాయెను, ఇంతకాలం, యిలా వెళ్ళినమీద – యిప్పుడు లేనిపోకిళ్ళకు పోయి – అన్నీ ఉడిగినదానిలాగా మడిగట్టుకు కూర్చుంటే ఎవరిని ఉద్ధరించినట్లు? యధాశక్తి – దేశానికి మనవల్లా రవంత ఏదో రూపేణా ఉపకారం జరగవలసిందే కనుక --

"కాఫీ త్రాగుదాం..." రాజమ్మ యింకా ఏమేమో ఎంతోసేపు అలా మాట్లాడుతూనే ఉంటుందని... ఆ అవకాశానికి సరిగా...మనసును పరధ్యానంలోకి దించేసి...అలా ఆలకించుతూ అవునూ కాదూ అనకుండా... విశ్రాంతిగా కుర్చీలో వాలిపడుకుని ఉన్నాను: చెప్పేదల్లా మాట ఛప్పున తుంచేసి వరుస మార్చింది.

కాఫీ యిద్దరమూ కలిసి త్రాగాము. నేను సిగరెట్టు కొసవరకు సిగరెట్టుగా ఆరగా ఆరగా, తోరణంగా అంటించుకుంటూ...ఆలోచన సాగని ఉక్కిరిబిక్కిరిలో ఉన్నాను. రాజమ్మ...మరీ ఒత్తుగా...కుర్చీ కమ్మీమీదనుంచి నా మీదికి జరిగి చక్కలిగిలిపెట్టినా – నేను ఉత్సాహం చంపుకునే కూర్చున్నాను--

'మీరు వెక్కసంగా త్రాగినట్లుగా ఉన్నారు...' అని రాజమ్మ వెక్కిరించింది.--

'ఏం...'

'ఏమో – ఏమీలేకపోతే – ఎందుకంత నిద్రమత్తు? – మీసత్తా తెలియనిదాని దగ్గిర వేయండి మీ వేషాలు -- మేలుకొలుపులు పాడించుకునే ముచ్చట ఏమన్నా ఉన్నదా? ప్రొద్దెంత ఉందో తెలుసునా? --'

'ప్రొద్దెంత పోయిందో తెలుసునుగనుకనా – పోయింది పోనీ---'

'రమ్మంది – రానీ – అని నే నందీయాలా?'

"అందుకు సందీయనిదే-"

"-- మరి -- ఎందుకూ నేను వచ్చింది? --"

'అందుకే ననుకో---'

'--అనుకున్నది - మీరు కొనుక్కుంటారనే--' మాటలతో పాటు - మనచేత ఏమవుతుంది? - మనసు బాగా లేదన్నాను. ఆమె చెప్పినది విన్నమీదట - ఎన్ని చెప్పి తప్పించుకుందా మనుకున్నా - రాజమ్మ - తనకు మాలిన ధర్మము కాదని - తనిసేదాకా - దయదలచి ఊరుకుంది కాదు - నా మనసులో ఇంకా ఎన్నో ప్రశ్నలు - ఆమె కవళికలో అవేవీ తేరిచూడలేని - అమాయకపు హాయి - ఆమె అవునన్నది... నేను కాదనగలవాడను కాను--

ఇంకా - ఎంతసేపైనా ఆమె ఉంటే బాగుండును - కాని - యింతలో తెల్లవారుతుంది.

సరే - యింతలో సరిపెట్టుకుని - తిరిగి పంపేస్తాను - మరి - వచ్చిన దోవనే, ఉత్తచేతులతోనైనా--? కాని, నేను విలుచుకునేది - సాటివాని అభిమానమైనప్పుడు - దానికి ధరకట్టగల తాహతు --

ఆమెకు ఆ మొగమాటమేమీ లేకపోయినందువల్ల - నేను ఒకందుకు బ్రతికిపోయినాను. "కష్టే ఫలీ" అని నవ్వుతూ నా ఆదరాన్ని - జాగ్రత్తగా లెక్కచూసుకుని - సంతోషించింది. రాజమ్మ ఎంతో తెలుగుమీరినా - వెనుకటి గుణం మానవైంది కదా అని - అదృష్టం ఎదురుతిరిగి ఒరసి రాటుదేరిన ఆమె సాహస ఉత్సాహం మెచ్చుకొనబోయే ఉబలాటం పడుతూన్న నాకు, ఆ బేరగత్తె తేరగా దక్కకపోవడమో ఏమో - లోలోపల అంతు చిక్కని ఉసూరు - తనం కమ్మించి - క్రుంగదీసింది - అర్థంఅయీ కాక - అంతు చిక్కనిదాని దేనికొరకో - మనసు వెదకులాడడం నా కన్నులలో - రాజమ్మ కనులు మరోవిధంగా గ్రహించుకున్నవి -

సముదాయింపుగా - దయగా - "ఎన్ని ఉన్నా -- అన్నీ ఆలోచించకుండా కాల్చేయడం - అవతల - పొరబాటున, ఒకటన్నా మిగిలి ఉండకూడదా అని - ఒప్పలో తప్పుకోసం వెతుక్కోవడం - మగజాతికి తగిపోయింది - లెండి. ఎంత దేవులాడినా ఖాళీ అయిపోయిన టిన్ - కనీ పెంచేదా ఏమైనా - మీకోసం, లేని సిగరెట్‌ను - ఎక్కడ నుంచి పుట్టిస్తుంది - " అని కవ్వించింది.

"అందుకోసం - కాదు -" అని, ఆమెకు తెలిసి పోతూన్న అబద్ధం ఆడాను--

"మరెందుకోసం--"

-- వేళ తరుముకు వస్తూన్న ఉద్రేకంలో సాఫీగా - సానీ సరసుడూ - హాయిగా అయిపోయినాం.

నిదుర మబ్బునిండిన కన్నులతో - రాజమ్మ నిలవ లేక తూలిపోదామనుకుంటున్న నన్ను - నిలువంతా గిలిగించి -

దాచి ఉంచిన సిగరెట్ - వెలిగించి - చిలిపిగా మెలకువకని - పొగఊది - నా పెదవులకు దాని నందించి - దయ లుంచమని -

- కారులో వెళ్ళిపోతూంటే ఆమె మౌన - హాసం - నేను కలగంటూన్నంత సేపూ ఉన్నది--

★ ★ ★